క్లుప్తంగా

పైప్‌లైన్‌కు మరమ్మతు



కరాసాలో పైప్‌లైన్ మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు కరాసాలో మంచినీటి పైప్‌లైన్ మరమ్మతుకు గురయింది. దీంతో మంచినీటి సరఫరా విభాగం డీఈ వర్మ పర్యవేక్షణలో మరమ్మతు పనులు జరిగాయి. పగిలిన పైప్ భాగాన్ని తొలగించి మరో పైప్ ముక్కను అతికించారు. ఈ పనులు ఒక రోజులోనే పూర్తి అవుతాయని సోమవారానికి యథావిధిగా మంచినీరు సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు.

జూనియర్ బాక్సర్లకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందిస్తున్న త్రినాథ్ యాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు పవనపుత్ర కాలనీలోని క్రీడా మైదానంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా చిన్నారులకు బాక్సింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. కోచ్ రమణ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన తరగతుల్లో పారిశ్రామిక ప్రాంతం నలుమూలల నుంచి సుమారు 30 మంది జూనియర్ బాక్సర్లు పాల్గొని మెలకువలు నేర్చుకున్నారు. వారికి పాలు, బ్రెడ్, ఉడికించిన గుడ్లను ట్రేడ్ యూనియన్ నాయకుడు త్రినాథ్ యాదవ్ పంపిణీ చేశారు. ఆసక్తి గల చిన్నారులకు ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు.. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇస్తామని కోచ్ రమణ తెలిపారు.

సేవా కార్యక్రమాలతో మాతృ దినోత్సవం



నవీన్‌కు నిత్యావసర సరకులు అందజేస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు లేని, అనాథ బాలబాలికలు, పిల్లలు ఉండి పట్టించుకోని తల్లిదండ్రులకు మాతృ హృదయంతో, మానవతా దృక్పథంతో ఆశ్రయం ఇస్తున్న కృపా సాధనా చారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి బి.నవీన్‌కు బియ్యం, పప్పు, గోధుమ పిండి, పంచదార, నూనె వంటి నిత్యావసర సరకులను అందజేశారు. పిల్లలకు దుస్తులు, దుప్పట్లు, ప్లేట్లు అందించారు. అనంతరం ఇళ్లల్లో పనులు చేసుకుంటూ తన పిల్లలను చదివించుకుంటున్న వెంకటేశ్వరి అనే పేద మాతృమూర్తిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శేషమణి, పుష్పలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఉపాధ్యక్షులు లీలానాయుడు, ఝాన్సీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు అందిస్తున్న రామారావు

అగనంపూడి: మాతృ దినోత్సవం సందర్భంగా 79వ వార్డు పాత అగనంపూడికి చెందిన మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు చిత్తా రామారావు మాట్లాడుతూ మాతృమూర్తి గొప్పదనం, త్యాగం గురించి వివరించారు. తల్లికి సేవ చేయడంలో ఉన్న ఆనందం, అనుభూతి ఇంకెక్కడా పొందలేమన్నారు.

భయపెడుతున్న స్పీడ్ బ్రేకర్లు



జీవీఎంసీ పాఠశాల సమీపాన గల స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పిన ద్విచక్రవాహన చోదకుడు (ఫైల్)



పాతరామాలయం వీధిలో స్పీడ్ బ్రేకర్

- రక్షణ ప్రమాణాలకు మించి ఎత్తుగా నిర్మాణం
- తొలగించాలని స్థానికుల డిమాండ్

మల్కాపురం: అతి వేగాన్ని నియంత్రించేందుకు వేసిన స్పీడ్ బ్రేకర్లు పలువురు గాయాల పాలు కావడానికి కారణంగా నిలుస్తున్నాయి. ఇక్కడ వేసిన స్పీడ్ బ్రేకర్లు పరిమితికి మించిన ఎత్తు కలిగి ఉండటంతో వాటిని దాటే క్రమంలో ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు.

జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల నుండి పాత రామాలయం వీధి మీదుగా గుల్లలపాలెం వెళ్లే వరకు ఇటీవల సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ మార్గం కాస్త ఇరుగ్గా ఉండటం, ఈ రోడ్డులో యువకులు తమ ద్విచక్ర వాహనాలపై అతి వేగంగా వస్తుండటం గమనించి కొత్తగా వేసిన సీసీ రోడ్డుపై పలు చోట్ల స్పీడ్ బ్రేకర్లు వేయించారు. నిజానికి ట్రాఫిక్ అధికారుల అనుమతితోనే స్పీడ్‌బ్రేకర్లు వేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ వేసిన స్పీడ్ బ్రేకర్లు 7 నుండి 10 అంగుళాల ఎత్తుతో కొండను తలపించే విధంగా ఏర్పాటు చేశారు. దీంతో ఎత్తయిన ఈ స్పీడ్ బ్రేకర్లను దాటి వెళ్లే సమయంలో ద్రిచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఆదివారం ఈ మార్గాన స్థానికంగా ఉంటున్న శ్రీనివాసరావు అతని బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నప్పుడు ఈ స్పీడ్‌బ్రేకర్‌ను దాటలేక అదుపు తప్పి పడి గాయపడ్డాడు. అలాగే భార్యాభర్తలు మార్కెట్ చేసుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో పాతరామాలయం వద్ద గల స్పీడ్ బ్రేకర్‌ను దాటుతూ అదుపు తప్పారు. రాత్రి సమయంలో ఈ మార్గాన విద్యుత్ సౌకర్యం అంతంతమాత్రంగా ఉండటంతో ఇక్కడి స్పీడ్‌బ్రేకర్లను గుర్తించలేక పలువురు గాయపడుతున్నారు. అధికారులు ఈ సమస్యపై స్పందించి, వేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని లేదా, నిర్దేశిత ఎత్తు ఉండేలా కొత్త స్పీడ్‌బ్రేకర్లు నిర్మించాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



ఈ మార్గాన వస్తున్నప్పుడు ఇక్కడ స్పీడ్ బ్రేకర్లను తప్పించలేక చాలా ఇబ్బంది పడుతున్నాం. వాహనాల వేగాన్ని తగ్గించేందుకు వేసినవిలా కాకుండా గాయపరచడానికి వేసినట్టు ఉన్నాయి. అధికారులు వీటిని తొలిగించే విధంగా చర్యలు తీసుకోవాలి.

పైలా శంకరరావు, ద్విచక్ర వాహనదారుడు

స్పీడ్ బ్రేకర్లు అంత ఎత్తు ఎందుకు?



ఇక్కడ వేసిన స్పీడ్‌బ్రేకర్లు చాలా ఎత్తుగా ఉన్నాయి. వీటిని దాటేటప్పుడు వాహనాలు అదుపు తప్పుతున్నాయి. నేను ద్విచక్ర వాహనంపై వస్తున్నప్పుడు నా వాహనం అనేక సార్లు అదుపు తప్పింది.

నారాయణ, పూల వ్యాపారి

తల్లిని గౌరవించడం మన సంస్కృతి



మాతృమూర్తికి చీర అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: తల్లిని గౌరవించడం భారతదేశ సంస్కృతిలో భాగమని 30 పడకల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు అన్నారు. మాతృమాల సేవా సంఘం, గీతా చానల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆసుపత్రి ప్రాంగణంలో అంతర్జాతీయ మాతృదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాతృమూర్తులకు వారి పిల్లల చేత పాద పూజ చేయించారు. అనంతరం వారికి చీరలు, పండ్లు, భగవద్గీత, తాంబూలం అందించారు. మాతృమాల సేవా సంఘం వ్యవస్థాపకుడు కోన వెంకటరావు, గీతా చానల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మండా విజయ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు పిన్నమనేని శ్రీనివాస్, రాజశేఖర్, నవీన్‌కుమార్, రవి లాల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం, కైలాసపురం పరిధి 16 గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో కైలాసపురం రోడ్డు మార్మోగింది. నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు, గ్రామ నాయకుడు గొర్లె చందు కుటుంబ సమేతంగా అమ్మవారికి తొలి పూజ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం జరిగిన ప్రధాన జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ధర్మకర్త ఎరిపిల్లి అప్పారావు, ఉత్సవ కమిటీ సభ్యుడు రాజు, దేముడు, రవి, కృష్ణ, శ్రీను ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిత్యావసర సరకుల అందజేత

అగనంపూడి: దువ్వాడ సెక్టార్–1కు చెందిన గుర్రాల నరసమ్మ చేయి విరిగి ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నిత్యావసర సరకులను అందించింది. మాతృ దినోత్సవం సందర్భంగా ఉక్కు అధికారి కె.ఎస్.ఎస్.సత్యనారాయణ మూర్తి ఆర్థిక సహకారంతో నెలకు సరిపడా బియ్యం, పప్పు దినుసులు, నూనె ఇతర వంట సామగ్రిని నరసమ్మకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, పట్టా రామ అప్పారావు, మస్తాన్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, ఎస్.గోవిందరావు, ఎల్.రాము, ఎ.వి.కృష్ణ పాల్గొన్నారు.

బాలిక వైద్యానికి సహకరించండి



బాలిక కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

సీతమ్మధార: జీబీ సిండ్రోమ్‌తో గత కొన్నేళ్లుగా మంచానికే పరిమితమైన ద్వారకానగర్‌కు చెందిన చిన్నారి కావ్య చికిత్సకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం కోరారు. చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ నగర కమిటీ ప్రతినిధులు సమకూర్చిన పదిహేను వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆదివారం బాలిక ఇంటికి వెళ్లి చిన్నారి తండ్రి హరికుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గులియన్ బ్యారీ సిండ్రోమ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వైద్య పరీక్షల్లో నాడి, రక్తపోటు సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ శరీరం అచేతనంగా ఉంటుందన్నారు. రూ. 50 లక్షలు అప్పు చేసి వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించిన ఈమె తండ్రి రైల్వే ఉద్యోగానికి సైతం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని గుర్తు చేశారు. తండ్రి పెన్షన్‌తోనే అరకొర వైద్యం అందిస్తు ఇక తాము ఆర్థికంగా తట్టుకోలేమని, వైద్యం నిలిపివేస్తామని కన్నీటి పర్యంతంతో వాపోతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, దాతలు చేయూతనిచ్చి బాలిక వైద్యానికయ్యే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టి తీసుకెళతామని అన్నారు. పట్టా ఫౌండేషన్ పట్టా రమేష్, ఫోరం డాక్టర్ శకుంతల, కె.ఎల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

దాబాగార్డెన్స్: విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఏసీపీ నరసింహమూర్తి సూచించారు. వన్‌టౌన్ రాజప్పనాయుడు వీధిలో గల గీతాభవన్‌లో గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం విభిన్న అంశాలపై నిర్వహించిన మనో వికాస వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో బాగా చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, దానిని సక్రమంగా వినియోగించుకుని ఉత్తమ విద్యార్థులుగా రాణించాలన్నారు. గీతా ప్రచార సమితి అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు పాల్గొన్న విద్యార్థుకు, వారి తల్లిదండ్రులకు, శిక్షణ అందించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఉపాధ్యక్షుడు పి. జగన్మోహనరావు, సంస్థ ప్రతినిధులు జీవీఆర్ ప్రసాద్, డి. కనకవల్లి, మహిళా సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయ సంగీతం అద్భుతం



సంగీత్ మేళాలో పాల్గొన్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి, అధికారులు



డీసీఏ కళాకారులతో ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి

- డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి
- ఆకట్టుకున్న డీసీఏ సంగీత్ మేళా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ఆధ్వర్యంలో డివిజనల్ కల్చరల్ అసోసియేషన్(డీసీఏ) ఆదివారం రైల్ గార్డెన్‌లో నిర్వహించిన క్లాసికల్ సంగీత్ మేళా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి మాట్లాడుతూ కళాకారుల్లోని కళలను ఇతరులకు తెలియజేసేదిగా ఈ సంగీత కార్యక్రమం ఉందన్నారు. భారతీయ సంప్రదాయ సంగీతం నిర్మలమైనది, అద్భుతమైనదని అభివర్ణించారు. ఇటువంటి సంగీతాన్ని శ్రోతలకు వినిపించడానికి ఈకార్వో, డీసీఏ చేస్తున్న ప్రయత్నాన్ని డీఆర్‌ఎం అభినందించారు. ఈకార్వో ప్రెసిడెంట్ పారిజాత సత్పతి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం మొదటిదని, దీని ద్వారా రైల్వే ఉద్యోగులు, సంగీత ప్రేమికులు చాలా ప్రోత్సాహం పొందారని తెలిపారు. వాల్తేర్ డివిజన్ కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన గాయకులు జి.వి.సురేష్, కె.వి.సురేష్, రణధీర్‌కుమార్, ఎస్.ఎ.రాజు, ఎం.భారతి, వాయిద్యకారులు యు.శ్రీనివాస్ తదితరులు హిందుస్థానీ, కర్ణాటక, భజన్లను ఆలపించారు. తమ ప్రదర్శనతో శ్రోతలు, సంగీత ప్రేమికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని విశిష్ట స్థానాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సందర్శించారు. సివిల్ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థి ఏసీసీవోఎం సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి.రామలింగరాజు, ఒరాకిల్ కార్పొరేషన్ వైస్ ప్రెసిడెంట్ జి.నరసింహారావు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏయూ సాధిస్తున్న ప్రగతిని వీసీ వారికి వివరించారు. స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలను నెలకొల్పడం, చైర్ ప్రొఫెసర్ల ఏర్పాటు, క్రీడా మైదానాల అభివృద్ధి, తదితర అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. డాక్టర్ రామలింగరాజు ఏయూలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో చైర్ ప్రొఫెసర్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. ఎంటెక్(జియోటెక్నికల్ ఇంజినీరింగ్)లో బంగారు పతకాన్ని ఏర్పాటు చేయడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని వర్సిటీ తరఫున వీసీ సత్కరించారు. అనంతరం వారు ఏయూ స్టార్టప్ సెంటర్‌ను సందర్శించారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమజ్జయంతి

- ఆంజనేయ స్వామికి విశేష పూజలు



గవర కంచరపాలెంలో వీరాంజనేయుడు



కరాసాలో పూజలు అందుకున్న హనుమాన్



జింక్ ఆంజనేయ స్వామి ఆలయ పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ లావణ్య, భక్తులు



లక్ష్మీనగర్ ఆంజనేయ స్వామి ఆలయ పూజల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



త్రినాథపురంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: నియోజకవర్గంలో ఆదివారం హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గోపాలపట్నం బంక్ సమీపంలోని హనుమాన్ ఆలయం, వెంకటాపురం, కాకానినగర్, ఎన్ఏడీ జంక్షన్ శివాలయం, కరాసా బంక్ వద్ద ఉన్న హనుమాన్ ఆలయాల్లో ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పూజలు, అభిషేకాలు చేశారు. తమలపాకులు, నిమ్మకాయలతో అర్చనలు జరిపారు. కరాసాలో అన్నదానం నిర్వహించారు.

- 52వ వార్డు కరాసా హనుమాన్ ఆలయం, 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ ఆలయాల్లో స్వామిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అందించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు పలికారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహించారు. 58వ వార్డు జింక్ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ఎమ్మెల్యే గణబాబు సింధూరం, తమలపాకులు, గారెలతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతించారు. స్వామికి ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్పొరేటర్ గులిగిండల లావణ్య తన కుటుంబ సభ్యులతో కలిసి జింక్ ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

- 61వ వార్డు మల్కాపురం బస్టాప్ వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పిలక రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ఆయన మజ్జిగ పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. స్థానిక చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువైన ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు.

గవర కంచరపాలెంలో..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెం వీరాంజనేయ ఆలయంలో తాపీమేస్త్రీ సంఘం ఆధ్వర్యంలో హనుమజ్జయంతి ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శర్మ పర్యవేక్షణలో సింధూరం, తమలపాకులు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆంజనేయస్వామికి వెండి పాదుకలు సమర్పించారు. అనంతరం సుమారు రెండువేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలోని పంచముఖ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే గణబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ఆయన ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చక్కటి పుస్తకం.. మంచి నేస్తం

అల్లిపురం: చక్కటి పుస్తకం.. మంచి నేస్తంతో సమానం అని ఉపాధ్యాయురాలు ఎస్.ఆరావతి అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం అల్లిపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలు బోధించారు. సెల్‌ఫోన్ వినియోగించకుండా గ్రంథాలయానికి వచ్చి మంచి పుస్తకాలు చదవటంతో పాటు విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని గుడి లేని దైవం అమ్మ అని వివరించారు. కల్మషం లేని ప్రేమ అమ్మది అని తెలిపారు. గ్రంథాలయాధికారి రాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు. వేసవి శిక్షణ శిబిరం గురించి స్నేహితులకు చెప్పి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల శాఖా గ్రంథాలయంలో..

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు అమ్మ కోసం (మాతృ దినోత్సవం) వివరించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ హిందీ మాస్టర్ కె. రమేష్ పాల్గొని మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అంటూ అమ్మకే అగ్ర తాంబూలం ఇస్తారని, సృష్టిలో ప్రతి ప్రాణికి మూల కారణం అమ్మ అని వివరించారు.

ఉద్యమిస్తున్నారన్న ఉక్రోషంతోనే ఉత్పత్తి నిలిపివేత



దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమిస్తుందన్న ఉక్రోషంతోనే స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపివేశారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 822వ రోజు ఆదివారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రైవేటీకరణలో భాగంగా ప్రస్తుత విశాఖ ఉక్కు యాజమాన్యం కూడా కేంద్రానికి సహకరిస్తూ ఒక్కొక్క అడుగు ముందుకు వేయాలని ప్రయత్నిస్తున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు అల్పాహారం



చిన్నారులకు ఎగ్జామ్ ప్యాడ్స్, కంపాస్ కిట్లు అందిస్తున్న డీవీఆర్

పెదగంట్యాడ: డీవీఆర్ స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు డీవీఆర్ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక జనరేషన్ యువ అనాథాశ్రమంలోని 30 మంది బాలలకు ఆదివారం అల్పాహారం అందజేశారు. అలాగే చిన్నారులకు ఎగ్జామ్ ప్యాడ్స్, కంపాస్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీవీ శంకరరావు, సూర్యచంద్ర, పితాని శ్రీను, డీవీటీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యను ఎదుర్కోగలిగితే భవిత ఉజ్వలం



విజ్ఞాన్ ఎంబీఏ కళాశాల పూర్వ విద్యార్థులు

అగనంపూడి: విద్యార్థులు సమస్యను ఎదుర్కొనే శక్తిని కల్గి ఉంటే భవిష్యత్ ఆశాజనకంగా, ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరని దువ్వాడ విజ్ఞాన్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. విజ్ఞాన్ ఎంబీఏ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎవరెవరు ఏమేం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో చాలామంది ఉన్నత ఉద్యోగాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, ఎంబీకే విభాగాధిపతి మురళి తదితరులు పాల్గొన్నారు.